# ఓ అమ్మాయి కథ

జొన్నలగడ్డ లలితాదేవి

**కృష్ణా బ్యారేజి మీద నిలబడిఅస్తంగత భానుని ఆఖరు కిరణాలు కృష్ణవేణీ నదీ తరంగ మాలికలపైబడి నారింజ వర్ణంలో మెరుస్తుంటే తదేకంగా చూస్తోంది భార్గవి.**

కళ్ళు ఆ ప్రకృతి పైనే కేంద్రీకృతమైనా మనసు మటుకు, అక్కడ లేదు. ఈ లోకంలో మసిలే మనుషులను గురించి ఆ మనుషులకు వుండే గుప్పెడు గుండెను గురించి ఆ గుప్పెడు గుండెలో వుండే కర్కోటకత్వం. కల్మషత్వం, అసూయ, గిట్టని తనం, అహంభావం, స్వార్థపరత్వం అన్నింటిని గురించి ఆలోచిస్తోంది.

ఆమె తల నెరిసిన — అనుభవాలతో రాటు దేలిన ఏ వృద్ధనారో అనుకుంటేపొరపాటే ఆమెకి పట్టుమని పాతికేళ్ళు మించిలేవు. అందంలో అప్సరసకాకున్నా కనుముక్కు తీరుకు లోపం లేని రూపమే. సన్నగా బంగారు తీగని సాగదీసినట్లువుండే రూపం. చదువు కూడా బి.ఏ. పట్టా పుచ్చుకుని టైపు హయ్యర్ ప్యాసైన పిల్ల. అయితే అన్నీ వున్నా అయిదవ తనమే తక్కువన్నట్టు అటు ఉత్తరాయణం, దక్షిణాయణం లేదా పెద్ద పెద్దవారి పలుకుబడి వుపయోగించుకునేపాటి స్వార్థ పరత్వమూ ఏమీ లేకపోవడం వల్ల ఆమెకి ఏ విధంగానూ లక్ష్మీ దేవి కటాక్షవీక్షణం లభించకుండా పోయింది ఉద్యోగ రూపంలో.

కుమార స్వామి అపర్ణా అండ్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజర్.

"డబ్బంటే ఎందరికో బలే మోజు. ఆ డబ్బు లేని వాడు లేడు ఈనాడు" అన్న కవిగారిపాటలా అతనికీ డబ్బన్నా - గొప్ప వాళ్ళ రికమండేషన్లా మహాభక్తి. అయితే ఎంత సజ్జనుడికైనా ఒక దుర్గుణం వుంటుందని ఎంత దుర్మార్గుడికైనా ఒక మంచి బుద్ధి వుంటుందన డానికి నిదర్శనంగా అతనికి అప్పుడప్పుడు మానవత్వం. అనే పేరు గుర్తు వస్తూ వుంటుంది.


అందర్నీ అడిగినట్టే అపర్ణా అండ్ కంపెనీకి వెళ్ళి అడిగింది భార్గవి. కులగోత్రాలు ఇంటి పరిస్థితీ అన్ని విశదంగా చెప్పుకుంది. తన క్వాలిఫికేషన్లూ చెప్పుకుంది. ఆక్షణంలో కుమార స్వామి మూడ్ బాగుండడం వల్ల ఎక్కువ జీతం ఇస్తారని మరో కంపెనీకి చెక్కేసిన ఆనంద కుమార్ స్థానంలో ఆమెని నియమించాడు. ఆ క్షణంలో ఆమె కుమారస్వామి సాక్షాత్తు తనని కాపాడటానికి వచ్చిన కార్తికేయునిగానే భావించుకుంది. ఆయన పేరుతో ఇంట్లో దీపం వెలిగించింది. దైవం మీద భక్తి కలది. భక్తి మీదనమ్మకం కలది కనుక తను అర్చించే పరమ శివునికి చేతులెత్తి మొక్కింది. కుమార స్వామికి ఆయురారోగ్యైశ్వర్యాలనివ్వాలని కోరుకుంది.

అక్కకి ఉద్యోగం దొరికింది తమ కష్టాలు గట్టెక్కాయని సంతోషించారు తమ్ముళ్ళు చెల్లెళ్ళు.

అంతవరకు కథ భాగానే వుంది.

ఆ ఆఫీసులో నాలుగు సెక్షన్లున్నాయి. ఒక్కొక్క సెక్షన్లో ఒక్కొక్క దానికి ప్రాధాన్యత వుంటుంది. ఆ సెక్షనుకు ఒక మేనేజర్. ఆ మేనేజర్‌కు అసిస్టెంటు, స్టాఫ్‌గా ఓ పది మంది చొప్పన వుంటూ వుంటారు.

అలాగే నాలుగు సెక్షన్లకూ నలుగురు మేనేజర్లు అసిస్టెంట్లు పదేసిమంది చొప్పన స్టాఫ్ మెంబర్లు వుంటూ వుంటారు.




ఎవరో ఉత్తరం —దక్షిణం లేకుండా ఉద్యోగంలో చేరిందిట. ఈ కాలంలో ఎవరబ్బా అలాంటి సన్యాసి నులకు ఉద్యోగం దొరికేది? అని గుర్రుగా చూశాడు మరో సెక్షను మేనేజర్ కుమారస్వామికి బాగా ఫ్రెండ్లీగా వుండే రామారావు.

రామారావు చాలా పొదుపరి. అతని పొదుపు ఉద్యమం ఆ ఆఫీసులోనే ప్రారంభం అవుతుంది. ఆఫీసుకు వచ్చే ఉత్తరాలలో పోస్టు ముద్రపడకుండా వున్నవన్నీ జాగ్రత్త చేసి పర్సులో దాచుకుంటాడు.

సామాన్యంగా తనంతట తాను కాఫీ తెప్పించు కోడు తాగడు. ఎవరైనా కాఫీకి రమ్మని ఆఫరు చేస్తే ఏదో వాళ్ళని ఉద్ధరించడానికన్నట్టు వెళ్ళి కాఫీ త్రాగు తాడు. అతనికి కాఫీ ఇప్పించడం వల్ల ఎన్ని లాభా లున్నాయో తెలుసుకున్న వారు తెలివిగా అతన్నించి పని తప్పించుకోవడానికి ఆ అస్త్రమే వుపయోగిస్తారు.

ఆ పాటి లౌక్యం తెలియని వాళ్ళకి బండచాకిరీ — రాత్రి ఎనిమిదింటి దాకా కంచిగరుడ సేవ తప్పదు. ఇంత చేసినా ఏదో ఒక చిన్న తప్పు భూతద్దంలోంచి చూసి దుమ్మెత్తిపోస్తూ పడుతూనేవుంటాడు.

పాపం ఆ ఆధారం లేకపోతే కుటుంబం అంతా పస్తులతో వీధిని పడిపోతామేమోనన్న భయం కొద్దీ ఏం అవమానం చేసినా దిగ్రమింగుకుంటారు. ఎంత పని చెప్పినా నోరెత్తకుండా చేస్తారు.

కారణం, వాళ్ళకి ప్రతి పైసా రూపాయితోసమానం వాళ్ళే కడుపుకట్టుకుని కాఫీలకి మొహంవాస్తువిజయవాడ ఎండల్లాగే మండిపోయే అద్దెలు భరిస్తూ పిల్లలకి పెట్టి మిగిల్తే భార్యాభర్తలు సర్దుకొనితినేకుటుంబాలకి ప్రతీకలైన మధ్య తరగతి బ్రతుకులు, వాళ్ళు ఏం ఇప్పించగలరు. వచ్చే జీతాలు చాలక అధిక ధరలతో బాధపడుతూ అద్దె యిళ్ళ అఘాయిత్యాల మధ్య రోజులు వెళ్ళదీసే బరువు బ్రతుకుల వాళ్ళు.

ఇవన్నీ స్వతహాగా మంచివాడైనా సావాసదోషం . అధికారదర్పం వల్ల కుమారస్వామికే కాస్తకాస్తే అంటు కున్నాయి ఇలాంటి జబ్బులు.

మేనేజర్‌గా తన హోదాకి తగిన ఫర్నిచరుండాలి - అధునాతన సామగ్రీ వుండాలి. తను చేసిన ఉపకారానికి అంతో ఇంతో కానుకలు ముడితే తన జీతంతో పాటు వచ్చే పై కానుకలతో రాజదర్బారులా ఇల్లు అలంకరించు కోవచ్చు.

పెళ్ళాం వళ్ళంతా సగమైనా బంగారంతో నింప వచ్చు.

ఏదైనా తన కష్టం గమనించక పరోపకార చింతనతో జీవించే వాడు ఉత్తముడు పరోపకారం చేయకపోయినా చేసేవారిని చెడగొట్టని వారు కూడా ఈరోజుల్లో ఉత్తములే.

తమకి ఏం సంబంధం లేకపోయినా ఓర్వలేనితనంతో ఎదుటివాళ్ళ నోట్లో మట్టి కొట్టాలని చూసే వాడు అధమాధముడే అయినా కలికాలం కనుక అలాంటి వారికే రోజులు.

"ఏమోయ్, కుమార్, నీకా పిల్లతప్ప వేసుకోవడానికి మరో మనిషి దొరక లేదేమిటి?" అని అడిగాడు వ్యంగ్యంగారామారావు.

"ఏదోలే పాపం, కాస్త పేదవారు. ఏదో మానవత్వం చూపించకపోత ఎలాగ? మరీ అంత హృదయంలేకుండా ఎలా వుండటం?" అని ఎదురు ప్రశ్నవేసాడు కుమారస్వామి.

"హృదయమా! అదెందుకుమధ్య, అసలుమనకుండే పేర్లేమిటి? ప్రభుత్వం అయితే ప్రభుత్వ యంత్రాంగం- ప్రైవేట్ అయితే కూడా అలాంటిదే. మనం సీట్లో కూర్చున్నది యంత్రంగా ఉక్కులా వుండాలిగాని, మానవత్వం హృదయం అంటూ పెద్ద డైలాగులు పెట్టి పిచ్చి పనులు చేయడానికి కాదు.

ఆ సీటులో మరో ఉద్యోగి అయితే నీకు ఎంత ముట్టేది? లేదా ఏ గొప్ప వాడి రికమండేషనో అయితే పరపతి పెరిగేదా? కానుకలందేవిగదా అన్నీ కనుసన్నల్లోకి వచ్చి పడేవి. గొప్పవాళ్లకి మనం కోరిక తీరిస్తే రేపు మనకి కావాలంటే ఓ టి.వి.యో, ఫ్రిజో పారేస్తారు. జోగీ జోగీ రాచుకుంటే ఏం వుంది? రాలేది బూడిదే కదా?

దరిద్రుడుని బాగు చేయడం — ఏదో జాలి. దయా అంటూ నీ హృదయంలోకి రావడం మన అభివృద్ధి విరోధకాలు, దీపం వుండగానే ఇల్లు చక్కపెట్టు కోవాలి. హోదా వుండగానే వినియోగించాలి. అధికారం చేతిలో వున్నప్పుడే నలుగురు గొప్పవాళ్ళనీ కూడగట్టుకోవాలి. ఆ తర్వాత మనం దిగిపోయాక ఏముంది, ఎవరూ మన ముఖం చూడరు." అంటూ నీతిబోధ చేయడం ప్రారంభించాడు. వెయ్యిగా వెయ్యిగా రాయి తగలకపోదు.

రామారావు మాటలకి వంత పాడాడు కుమారస్వామి, అసిస్టెంట్ నరేంద్ర. వంచిన తలఎత్తకుండా తన పని తను చేసుకుపోయే భార్గవి అంటే అతనికేం సదభిప్రాయం కలుగలేదు.

కాఫీ ఇప్పించదు. పోనీ అంటే నెల జీతం అందుకుంటే ఏమన్నా ఇస్తుందేమో ఉడతా భక్తిగా అనుకుంటే దర్జాగా పర్సులో వేసుకుపోయింది జీతం దానికి తగినట్టు నాకు తెలిసిన ఆవిడ వుంది. ఆవిడకి సరదాగా ఉద్యోగం చేయాలని వుందట, మొగుడు పెద్ద ఆఫీసరు అంటే కలెక్టర్ హోదాలోకి వస్తున్నాడు. ఐ.ఏ.ఎస్. రేపో మాపో కలెక్టరు అయిపోగలడు — పిల్లా పీచు లేరు. ఆవిడ సరదా పడుతోంది. ఆవిడికా పోస్టు ఇచ్చేశావంటే, ముందు నీకు బట్టలు పెడుతుంది. ఆ తర్వాత కానుకలు చాలా యిస్తుంది. మొగుడితో చెప్పి మనకు ఏం




అవసరమైన ఆ పని నెరవేర్చి పెడుతుంది. ఈ పిల్లకి రావలసిన జీతం ఇచ్చేసి పంపేయి అంటూ ఊదరగొట్టసాగాడు రామారావు ప్రక్కన నరేంద్రతో కలిసి. ఆ మాటలు అక్షర లక్షలులా తోచేయి కుమారస్వామికి. అంతే,! మూడు మాసాల క్రితం వున్న జాలి — సానుభూతి కరుణా ఏమయిపోయాయో ఏమో మరి భార్గవిని పిలిపించాడు.

"మీ పని మాకు నచ్చడం లేదు ... మాకు తృప్తిగా లేదు, మిమ్మల్ని ఉద్యోగంలోంచి తీసేస్తున్నాం" అని కూమారస్వామి చెప్పినప్పుడు ఏం చేయలేక భోరున ఏడ్చింది భార్గవి. మనసులో అదే పోస్టుకు కాబోయే కలెక్టరు గారి భార్యని వేసుకున్నారని తెలిసినప్పుడు వెచ్చని కన్నీటి బొట్లు రాలుతుంటే ఇంట్లో వారి చివాట్లు హేళనలు భరించలేక బ్యారేజి దగ్గరకువచ్చింది. కృష్ణమ్మకు వినిపించాలని తెల్లవారిలేస్తే ఇలాంటి అన్యాయాలు దారుణాలు చూసి చూసి కోపంతో ఎరుపెక్కిన సూర్యభగవానుడు అదృశ్యమయిపోయాడు. అంతకంటే ఏం చేయలేక.

*